సాక్షి నంద్యాల

బుధవారం : 24 : సెప్టెంబర్ : 2025



సంక్షోభంలో ఆప్కో!

చేనేత వస్త్రాలను మార్కెటింగ్ చేసే ఆప్కో మను గడ ప్రశ్నార్థకంగా మారింది. గతేడాది అధికారం లోకి వచ్చిన కూటమి సర్కారు ఈ సంస్థపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. 8లో▸



అట్టహాసంగా..

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మిగ నూరులో జరుగుతున్న ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి బాలబాలికలు హాజరయ్యారు. 8లో▸



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేది కపై మంగళవారం నంద్యాలకు చెందిన ఎస్ నాట్యాంజలి కూచిపూడి కళాక్షేత్రం వారి సంప్ర దాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

ఓపెన్ స్కూల్ ప్రవేశానికి గడువు పెంపు

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీటం (ఏపీఓఎస్ఎస్) 2025-26 విద్యా సంవత్సరానికి పదవ తరగతి, ఇంటర్మీడియెట్ తరగతుల్లో ప్రవేశానికి రూ.200 అపరాధ రుసుంతో ఈనెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 సంవత్సరాలు నిండిన వారు పదవ తరగతిలో, 15 సంవత్సరాలు నిండిన వారు పది పాస్ అయి ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్ పొందవచ్చన్నారు. మరింత సమాచారం కోసం www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో లేదా సమీపంలో ఉన్న ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో, డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యమొద్దు



ఉయ్యాలవాడ రెవెన్యూ కార్యాలయంలో అర్జీలను పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

ఉయ్యాలవాడ: పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. మంగళవారం ఉయ్యాలవాడ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్జీదారులను పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా అర్జీ అర్థమయ్యే విధంగా ఎండార్స్‌మెంట్ క్లియర్‌గా ఇవ్వాలన్నారు. ఉయ్యాలవాడ మండలంలో ఎక్కువగా భూ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయని, భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని తహసీల్దార్ ప్రసాద్‌బాబు, ఆర్ఐ అంకన్న, మండల సర్వేయర్ విజయలక్ష్మి, సూచించారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగింపు

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతిలో ప్రవేశానికి గడువు తేదీ ఈ నెల 29 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు పొడిగించినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యార్థులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రవేశ పరీక్ష 7.2.2026న నిర్వహిస్తామన్నారు. సందేహాలుంటే 08512-294545 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎస్సీ యువతకు ఆర్టీసీలో డ్రైవింగ్ శిక్షణ

కర్నూలు(అర్బన్): జిల్లాలోని షెడ్యూల్డు కులాల సేవా ఆర్థిక సహకార సంస్థ ద్వారా ఎంపికైన షెడ్యూల్డు కులాలకు చెందిన యువతకు హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ శిక్షణను ఆర్టీసీలో ఇప్పించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.తులసీదేవి తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఈఓ విజయలక్ష్మితో కలిసి ఆమె ఎంపికైన అభ్యర్థుల జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా తులసీదేవి మాట్లాడుతూ శిక్షణ కోసం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. కర్నూలు జిల్లాలో 10 మందిని, నంద్యాల జిల్లాలో 10 మందిని ఎంపిక చేశామన్నారు. శిక్షణనిచ్చే అంశాన్ని రెండు జిల్లాల కలెక్టర్ల దృష్టికి తీసుకుపోతామన్నారు. అనుమతి రాగానే ఆర్టీసీ ట్రైనింగ్ కళాశాలల్లో శిక్షణ మొదలవుతుందని పేర్కొన్నారు.



ఆత్మకూరు - దోర్నాల ఘాట్ రోడ్డు

అడ్డంకులు అధిగమించే దారేదీ?

- ఎన్‌హెచ్ 167కే, ఎన్‌హెచ్340సీ నిర్మాణానికి అటవీ అనుమతుల చిక్కులు
- నత్తనడకన భూ సేకరణ ప్రక్రియ
- నల్లమలలో నిలిచిన రహదారుల నిర్మాణం



నల్లకాల్వ సమీపంలో ఎన్‌హెచ్ 167కే పనులు ప్రారంభమైన దృశ్యం


ఆత్మకూరురూరల్: జిల్లా మీదుగా కొత్తగా నిర్మిస్తున్న జాతీయ రహదారులు ఎన్‌హెచ్167కే (కల్వకుర్తి -నంద్యాల), ఎన్‌హెచ్ 340సీ (కర్నూలు - అమరావతి) నిర్మాణానికి నల్లమలలో భూ సేకరణ నత్తనడకన సాగుతోంది. ఈ రెండు రహదారులు కొంత దూరం నల్లమల అడవుల మీదుగా వెళుతుండడం, అదీ కీలకమైన నాగార్జున సాగర్ -శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం కావడంతో రహదారుల నిర్మాణానికి అటవీ చట్టాలు పెద్ద అడ్డంకిగా మారాయి. 167కే జాతీయ రహదారికి సంబంధించిన పనులు జిల్లాలో ఇటీవల మొదలయ్యాయి. కాని నల్లకాల్వ -బోయరేవుల ప్యాకేజీ మాత్రం ఇంతవరకు భూసేకరణతో పాటు ఏ ప్రాథమిక చర్యలు చేపట్టలేదు. కేంద్ర పర్యావరణ అటవీశాఖ అనుమతులు రాకపోవడమే ప్రధాన కారణం. అలాగే 340సీలో కూడా అమలాపురం నుంచి అటవీ మార్గంలో పనులు కూడా భూసేకరణ కారణంతోనే ప్రారంభమవ్వలేదు. సాధారణంగా ఇటువంటి ప్రజాప్రయోజన పనులకు అనుమతులు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షణలో ఉండే నేషనల్ వైల్డ్ లైఫ్ బోర్డు సమావేశమై నిర్ణయం ప్రకటించాల్సి ఉంది. కానీ ఇంతవరకు జాతీయ రహదారుల సంస్థ ప్రతిపాదనలు నేషనల్ వైల్డ్‌లైఫ్ బోర్డుకు చేరాయో.. లేదో? తెలియడం లేదు. అటు ఎన్‌హెచ్‌ఏ.. ఇటు అటవీ శాఖ అధికారులు ఈ విషయంపై స్పష్టత ఇవ్వడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు రహదారుల భూసేకరణపై సమీక్ష, సమావేశాలు నిర్వహిస్తున్నారే కానీ సమస్య పరిష్కా రంపై దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

పర్యావరణాన్ని కాపాడుతూ.. వన్యప్రాణులను రక్షిస్తూ..

అటవీ, అందులోని వన్యప్రాణుల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోంది. కొన్ని రహదారుల్లో రాత్రి వేళ వాహనాల రాకపోకలు సైతం నిషేధిస్తోంది. ఏడాదిలో కొంత కాలం జంతువుల కలయిక కోసం అటవీ ప్రాంతంలో జన సంచారాన్ని అడ్డుకుంటోంది. ప్రత్యేకంగా అధికారులు, సిబ్బందిని నియమించి అటవీ సంరక్షణకు పెద్దపీట వేస్తోంది. అటవీ చట్టాలను కఠిన తరం చేసి పకడ్బందీగా అమలు చేస్తోంది. అడవుల్లో సాధారణ రహదారులు ఉంటేనే వన్యప్రాణుల సహజ జీవన శైలిపై ఎంతో ప్రభావం చూపుతుంది. వేగంగా వెళ్లే వాహనాలు ఢీకొని వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికే ఆత్మకూరు - దోర్నాల, ఆత్మకూరు - నంద్యాల రహదారుల్లో పలు మార్లు చిరుతలు, దుప్పులు, గోల్డెన్ జాకాల్ వంటి జంతువులు వాహనాలు ఢీకొని మరణించాయి. వాహనాల్లో ప్రయాణించే వారు ఎక్కడ పడితే అక్కడ వాహనాలు ఆపి చిరుతిల్లు తింటూ వాటిని తెచ్చుకున్న ప్లాస్టిక్ కవర్లను విచ్చలవిడిగా పారవేసి పర్యావరణ విధ్వంసానికి కారణమవుతున్నారు. ఇలాంటి క్రమంలో నాలుగు వరుసల జాతీయ రహదారి అంటే వాహనాలు వేగంగా వెళ్తే వన్యప్రాణులకు ఎంతో ముప్పు ఉంటుంది.

అటు వైపు ఎలివేటెడ్ కారిడార్‌కు ప్రతిపాదనలు..

ఇటీవల తెలంగాణ ప్రభుత్వం అమ్రాబాద్ అడవుల్లో శ్రీశైలం రహదారిని ఎలివేటెడ్ కారిడార్‌గా నిర్మించేందుకు అనుమతుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. పట్టణాలలో నిర్మించే ఫ్లైఓవర్‌లా అడవుల్లో కూడా పిల్లర్లపై అడవిపై రహదారిని నిర్మించడమే ఎలివేటెడ్ కారిడార్ అంటారు. అడవుల్లో జాతీయ రహదారుల నిర్మాణానికి ఇదే అత్యుత్తమ పరిష్కారంగా కనిపిస్తోంది. నిజానికి ఈ పద్ధతిలో నిర్మాణ వ్యయం భారీగా పెరుగుతుంది. కానీ తెలంగాణ ప్రభుత్వం ఇందుకు ప్రతిపాదించడం చూస్తే కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మాణం కానున్న జాతీయ రహదారులకు ఆర్థికంగా పెద్ద సమస్య కాబోదని తెలుస్తోంది. నల్లకాల్వ - వెలుగోడు మధ్య కేవలం ఏడు కి.మీ దూరం మాత్రమే ఫ్లైఓవర్ నిర్మించాల్సి ఉంటుంది. అలాగే కర్నూలు - గుంటూరు మార్గంలో ఎస్ఎస్ తండా నుంచి ప్రకాశం జిల్లాలోని కొర్రప్రోలు వరకు సుమారు 30 కి.మీ ఇలాంటి ఫ్లైఓవర్ నిర్మించాలి. అప్పుడు అటు అటవీ రక్షణకు, వన్యప్రాణి సంరక్షణకు సమస్యలు తలెత్తవు. ప్రయాణికులకు వేగంగా గమ్యం చేరుకునే వీలు కలుగుతుంది. అందుకే నోడల్ సంస్థ అయిన ఎన్‌హెచ్‌ఏ ఈ ప్రణాళికను కేంద్ర వైల్డ్ లైఫ్ బోర్డు ముందు పెట్టాల్సి ఉంది.



ఎలివేటెడ్ కారిడార్ (ఊహా చిత్రం)

అనిమల్ వాకోవర్ వంతెనలు పరిష్కార మార్గం

ఫ్లైఓవర్ బ్రిడ్జిలు ఆర్థిక సమస్యలు ఎదురైతే మరో పరిష్కారంగా అనిమల్ వాకోవర్ బ్రిడ్జిలను రెండో పరిష్కారంగా తీసుకోవచ్చు. నిర్ణీత దూరంలో ప్రధాన రహదారికి అడ్డంగా పైన బ్రిడ్జిలు కట్టడం. రహదారిపై నుంచి వన్య ప్రాణులు క్షేమంగా ఈ బ్రిడ్జిలపై నుంచి రాకపోకలు సాగించవచ్చు. ఈ బ్రిడ్జిలపై గడ్డి, చిన్నచిన్న మొక్కలు పొదలు పెంచడం ద్వారా వన్య ప్రాణులు అటవీ వాతావరణంలోనే రహదారులను ప్రమాద రహితంగా దాటగలుగుతాయి. మిగతాదారి పొడవునా బారికేడింగ్ చేయాల్సి ఉంటుంది.

ఇల కైలాసం.. దేవీ వైభవం



స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

- శ్రీగిరిలో దేదీప్యమానంగా దేవీ శరన్నవరాత్రులు
- బ్రహ్మచారిణి అలంకారంలో శ్రీశైల భ్రామరీ..
- మయూర వాహన సేవలో ఆదిదంపతుల విహారం
- స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పులకించిన భక్తజనం



ఉత్సవంలో కళాకారుల నృత్య ప్రదర్శన



శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైల మహాపుణ్యక్షేత్రంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇల కైలాసంలో దేవీ వైభవాన్ని కనులారా తిలకించిన భక్తజనం తన్మయత్వానికి లోనయ్యారు. దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం శ్రీశైల భ్రామరీ బ్రహ్మచారిణి స్వరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంక్రీకృతులైన అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయం ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఉంచి అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్చరణల నడుమ పూజలు చేశారు. ప్రత్యేక అలంక్రీకృతులైన అమ్మవారి స్వరూపాన్ని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటూ నీరాజనాలు సమర్పిస్తున్నారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం శ్రీశైల క్షేత్రంలో చంద్రఘంట అలంకారంలో అమ్మవారు, రావణ వాహనసేవపై స్వామిఅమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

మయూర వాహనంపై మల్లన్న విహారం

దసరా మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిఅమ్మవారలు మయూర వాహనంపై విహరించి భక్తులకు ఆశీస్సులు అందించారు. బ్రహ్మచారిణి స్వరూపంలోని అమ్మవారిని, మయూర వాహనంపై అధిష్టించిన స్వామిఅమ్మవార్లను ఆలయ రాజగోపురం మీదుగా వెలుపలకి తీసుకొచ్చి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గంగాధర మండపం నుంచి నందిమండపం, అక్కడి నుంచి బయలువీరభద్ర స్వామి ఆలయం వరకు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో కళాకారుల నృత్యాలు, డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆయా పూజల్లో దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు దంపతులు, తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న గిరిజన సంప్రదాయ కొమ్ము నృత్యం

ఉల్లి ధర మరింత పతనం

- క్వింటా ధర రూ.93 నుంచి రూ.459లోపే!

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి ధర మరింత తగ్గింది. క్వింటా ధర రూ.93 నుంచి రూ.459 వరకు మాత్రమే పలికింది. మద్దతు ధరతో ఉల్లి కొనుగోలుకు స్వస్తి పలకడంతో ఉల్లి రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. మద్దతు ధర ఉన్నంత వరకు మార్కెట్‌కు ఉల్లి వెల్లువెత్తింది. ఆగస్టు నెలలోనే 12 వేల క్వింటాళ్లు.. సెప్టెంబర్ నెలలో గరిష్టంగా 18 వేల క్వింటాళ్లు వచ్చింది. ప్రభుత్వం మద్దతు ధరతో ఉల్లి కొనుగోళ్లు నిలిపివేయడంతో మార్కెట్‌కు ఉల్లి రావడం పూర్తిగా తగ్గిపోయింది. సోమవారం 2,445 క్వింటాళ్లు రాగా.. మంగళవారం 1806 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు, ఆముదం, సజ్జల ధరలు కూడా మరింత పడిపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

రేషన్ డీలర్లకు కొత్త ఈ - పాస్ మిషన్ల పంపిణీ

నంద్యాల(అర్బన్): జిల్లాలోని 1,204 మంది రేషన్ దుకాణ దారులకు పాత ఈ - పాస్ మిషన్ల స్థానంలో కొత్త ఈ - పాస్ మిషన్లను జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచర్ అందించారు. మంగళవారం స్థానిక పీజీఆర్ఎస్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ ఆన్‌డ్రోయిడ్ మైక్రో కంట్రోలర్ ఆధారిత, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ గుర్తింపు, టచ్ స్క్రీన్ ఇంటర్ ఫేస్ డేటా ప్రాసెసింగ్ సామర్థ్యం కలిగిన కొత్త ఈ - పాస్ మిషన్లను పంపిణీ చేశామన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, కచ్చితమైన సేవలు అందించడంలో ఈ మిషన్లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ విశ్వనాథ్, జిల్లా పౌరసరఫరాల అధికారి రవిబాబు, డీటీలు ప్రసాదరావు, శేఖర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

బేతంచెర్ల: రైతుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన మధుశేఖర్ గౌడు తన పొలంలో రహదారి లేకున్న మరో రైతు అక్రమంగా తన పొలంలో వెళ్తున్నాడని, సమస్యను రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదంటూ సోమవారం కలెక్టరేట్ ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి పెట్రోలు పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన విషయం విధితమే. స్వయంగా తానే సమస్యను పరిశీలించి పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఆర్ఎస్ రంగాపురం చేరుకుని పొలం రహదారిని పరిశీలించారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన పట్టా, అనుభవం దారుల వివరాలను ఆర్డీఓ నరసింహులు, డిప్యూటీ తహసీల్దార్ మారుతి, మండల సర్వేయర్, వీఆర్వో మధుతో చర్చించారు. బాధితుడు మధు శేఖర్ గౌడు తాత ఈడిగ మద్దిలేటికి 1970లో 961-బీ2ఏ 5 ఎకరాల డీ పట్టాను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. కాని బాధితుడు రహదారికి సంబంధించి ఇచ్చిన దరఖాస్తు సర్వే నంబర్ 961-బీ2బీలో 2.62 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎవ్వరికి అసైన్‌మెంట్ చేయలేదని కలెక్టర్, ఆర్డీఓ నరసింహులు విన్నవించారు. ఇరువర్గాల రైతుల సమస్యల విన్న అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇద్దరి రైతులకు నోటీసులు ఇచ్చి తుది నివేదిక మంజూరు చేస్తానని, 15 రోజుల తరువాత ఇచ్చే తుది నివేదికకు ఇరువర్గాలు కట్టుబడి ఉండాలని హెచ్చరించారు. రంగాపురం గ్రామానికి చెందిన మాధవ రెడ్డి మరి కొంత మంది గ్రామస్తులు 340(బీ) జాతీయ రహదారి నిర్మాణంలో తమ దుకాణాలు కూల్చి వేయడంతో ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్త సారోళ్లు వచ్చేదెప్పుడు?

- జిల్లా కేంద్రంలోనే నియామక పత్రాలు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్
- వచ్చే నెల 3 నుంచి 10 వరకు నూతన ఉపాధ్యాయులకు శిక్షణ



నంద్యాల(న్యూటౌన్): కూటమి ప్రభుత్వం నిర్వాకంతో ఎంతో కష్టపడి చదివి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించామనే ఆనందం డీఎస్సీ అభ్యర్థుల్లో రోజురోజుకు ఆవిరైపోతుంది. ప్రభుత్వం ఆర్భాటాలకు పోకుండా ఉంటే దసరా తర్వాత రెండు, మూడు రోజుల్లోనే కొత్త ఉపాధ్యాయులు బాధ్యతలు చేపట్టేవారు. కానీ ప్రభుత్వ తీరుతో మరింత జాప్యమవుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. డీఎస్సీ ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఇక నియామక పత్రాల పంపిణీ ప్రక్రియ మాత్రమే మిగిలిపోయింది. అయితే ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 19న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అమరావతిలో నియామక పత్రాలు అందజేయాలని విద్యాశాఖ అధికారులు భావించారు. అలాగే 22వ తేదీ నుంచి కౌన్సెలింగ్ నిర్వహించాలని షెడ్యూల్ కూడా ఖరారు చేశారు. దసరా సెలవుల్లో ఈనెల 29 వరకు కొత్తగా ఎంపికైన అధ్యాపకులకు శిక్షణ ఇచ్చి, కౌన్సెలింగ్ నిర్వహించాలని భావించారు. దీంతో దసరా సెలవుల అనంతరం కేటాయించిన పాఠశాలల్లో చేరాల్సి ఉండేది. అయితే భారీ వర్షాల కారణంగా నియామక పత్రాల పంపిణీ ప్రక్రియ వాయిదా వేసి ఈనెల 25వ తేదీకి మార్పు చేశారు. అయితే రెండు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుండటంతో మళ్లీ వాయిదా వేస్తారేమోనని ఎంపికైన అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,678 పోస్టులకు గానూ, 2,590 మందిని ఎంపిక చేస్తూ తుది జాబితా విడుదల చేసింది. మరో 88 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లే రంటూ భర్తీ చేయకుండా మిగిల్చింది. మిగిలిన పోస్టులను మళ్లీ విడుదల డీఎస్సీలో కలుపుతారని విద్యాశాఖ అధికా రుల ద్వారా తెలుస్తోంది. కొత్త ఉపాధ్యాయులకు ఈ నెల 25న నియామక పత్రాలు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో పాటు వచ్చే నెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ శిక్షణ ఇవ్వనున్నట్లు విద్యా శాఖ అధికారుల ద్వారా తెలిసింది. అయితే 150 రోజుల పాటు డీఎస్సీ నిర్వహణ సాగదీసి ఆర్డర్ కాపీలు ఇచ్చే సమయానికి వాయిదాలు వేయడంతో అభ్యర్థులు మండిపడుతు న్నారు. ఉపాధ్యాయ నియామక పత్రాల కసరత్తును కూటమి ప్రభుత్వం రాజకీయ ప్రచారంగా మలుచుకుందనే విమర్శలు వినిపిస్తున్నా యి. ఈనెల 25వ తేదీన మళ్లీ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి విజయవాడకు రావాలని ప్రకటించడంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లా కేంద్రంలోనే ఇవ్వాలని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అవును.. నిధులివ్వలేదు!

మైనార్టీ సంక్షేమం గాలికి..

- కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా
- హామీల వారీగా ప్రశ్నల వర్షం
- ఒక్క పైసా నిధులు విడుదల చేయలేదన్న మంత్రి ఫరూక్
- ఈ విడత ఆదుకుంటామని వెల్లడి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా

బొమ్మలసత్రం: శాసనమండలిలో ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా మంగళవారం అడిగిన ప్రశ్నలకు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎమ్‌డీ ఫరూక్ ఇచ్చిన సమాధానం చూస్తే కూటమి ప్రభుత్వం తమను మోసం చేసిందన్న విషయం మైనారిటీలకు ఇట్టే అర్థమైంది.

శాసన మండలిలలో ఎమ్మెల్సీ అడిగిన ప్రశ్నలు

➤ 2025-26బడ్జెట్‌లో మైనారిటీల సంక్షేమానికి రూ.5,434కోట్లు, 2024-25 బడ్జెట్‌లో రూ.4,376 కోట్లు, సబ్‌ప్లాన్ కింద రూ.2,512 కోట్లు కేటాయించామని కూటమి ప్రభుత్వం చెబుతోంది.

➤ 50 ఏళ్లు నిండిన మైనారిటీలకు పింఛన్ అందిస్తామన్నారు.

➤ ఇద్గాల కోసం స్థలాలు కేటాయిస్తామన్నారు.

➤ హజ్‌హౌస్ నిర్మాణానికి, నూర్‌బాషా కార్పొరేషన్‌కు నిధులు.

➤ రూ.5 లక్షల వడ్డీ లేని రుణాలు.

➤ ఇమామ్, మౌజాన్‌లకు ప్రతినెలా రూ.5 వేల గౌరవ వేతనం.

➤ దుల్హన్ పథకం ద్వారా రూ.లక్ష.

➤ మైనారిటీ కార్పొరేషన్ ద్వారా మైనారిటీ యువతి, యువకులకు ఆర్థిక తోడ్పాటు. రూ.2 లక్షలు, రూ.5 లక్షల స్కీమ్ కింద 50 శాతం సబ్సిడీ.

➤ ఈ పథకాలన్నీ కూటమి ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుంది. ఈ ఏడాది బడ్జెట్ ఈ ఏడాదే అమలు చేస్తారా.. లేదా వచ్చే ఏడాది అమలు చేస్తారా?

మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఇచ్చిన సమాధానం

2024-25 బడ్జెట్‌లో రూ.173.5 కోట్లు కేటాయించాం. కానీ అప్పుడు ఆర్థిక ఇబ్బందుల వల్ల నిధులు విడుదల చేయలేకపోయాం.

- 2025-26 బడ్జెట్‌లో రూ.173.5 కోట్లు కేటాయించాం. అయితే ఫైనాన్స్ విభాగంలో ఉంది.
- నిధులు విడుదల కాగానే దాదాపు 19,779 మంది మైనార్టీ యువతకు ప్రయోజనం కలుగుతుంది.

వీటికి సమాధానం కరువు

- మౌజాన్, ఇమామ్‌ల గౌరవవేతనం, 50 ఏళ్లు పైబడిన వారికి పింఛన్, ఈద్గాలకు స్థలాల కేటాయింపు, హజ్‌హౌస్ నిర్మాణానికి నిధులు, నూర్‌బాషాల సంక్షేమానికి నిధులు, దుల్హన్ పథకం తదితర ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇవ్వకుండా దాటవేయడం గమనార్హం.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా..

మైనారిటీల సంక్షేమానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 21,365.13 కోట్లు కేటాయించింది. 2019 నుంచి 2024 మధ్య కాలంలో 51,04,409 మంది మైనారిటీలకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా నిధులు మంజూరు చేసింది. మౌజాన్‌ల గౌరవ వేతనం రూ.3 వేల నుంచి రూ.5 వేలకు పెంపు, ఇమామ్‌లకు రూ. 5 వేల నుంచి రూ.10 వేలకు పెంచి వారికి ప్రతి నెలా క్రమం తప్పకుండా అందించడం విశేషం.

క్లుప్తంగా

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

కర్నూలు కల్చరల్ : దసరా సెలవుల్లో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్ తెలిపారు. కొన్ని పాఠశాలలు తరగతులు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఎలాంటి తరగతులు నిర్వహించకూడదని తెలిపారు. ఎంఈఓలు, డిప్యూటీ ఈఓలు తమ పరిధిలోని ఏవైనా పాఠశాలలు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వెంటనే నోటీసులు జారీ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వేంపెంటలో కొండ చిలువ కలకలం


ఇంటి ముందు ఉన్న కొండచిలువ

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామం ఎస్సీ కాలనీలో మంగళవారం రాత్రి కొండచిలువ కనిపించింది. సెవెన్త్ డే చర్చి వెనక సామేలు అనే వ్యక్తి ఇంటి వద్ద ఉన్న కొండచిలువను కాలనీ వాసులు గమనించారు. ఫొటోలు, వీడియోలు తీసి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా స్పందించంలేదని తెలిపారు. ఇళ్ల నుంచి బయటకు వస్తే ఏం జరుగుతుందోననే భయంతో బయటకు రాలేకపోతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు.

ఫేక్ ఉద్యోగాలపై ఎస్పీకి ఫిర్యాదు

కర్నూలు కల్చరల్: ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో విధుల్లో ఫేక్‌గా నియమితులైన ఉదంతంపై జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు జిల్లా విద్యాశాఖ తరఫున ఫిర్యాదు చేసినట్లు డీఈఓ శామ్యూల్‌పాల్ తెలిపారు. ఈ విషయమై పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ చేయనున్నారని పేర్కొన్నారు. ఇందులో ఎంతటివారున్నా చర్యలు తప్పవన్నారు. విద్యాశాఖకు సంబంధించిన వ్యక్తుల ప్రమేయమున్నా వదిలిపెట్టమని డీఈఓ చెప్పారు.

ఉదయం 9 గంటల వరకే మార్కెట్‌లోకి అనుమతి

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాలు పడుతున్నందున వ్యవసాయ ఉత్పత్తులను కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోకి ఉదయం 9 గంటల వరకు మాత్రమే అనుమతిస్తామని మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. ఉదయం 9 గంటల తర్వాత వచ్చిన వాహనాలను మార్కెట్ లోపలికి అనుమతించబోమని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉల్లి గడ్డలను పొలంలోనే గ్రేడింగ్ చేసుకొని మార్కెట్‌కు తీసుకరావాలని సూచించారు. ఎలాంటి మురుగులు లేకుండా తెచ్చిన ఉల్లిగడ్డలకు మంచి ధర లభిస్తుందన్నారు.

చిరుత కోసం గాలింపు


కొండ ప్రాంతాల్లో గాలిస్తున్న అటవీశాఖ, సోలార్ సిబ్బంది

పాణ్యం: రెండు రోజులగా కందికాయపల్లె గ్రామస్తులను భయపెడుతున్న చిరుతపులి జాడ కోసం అటవీశాఖ అధికారులు, సోలార్ అధికారులు ముమ్మర గాలింపు చేపట్టారు. గత నెల 25న కూడా పెద్దమ్మ గుడి వద్ద సోలార్‌లో చిరుత సంచరిచిన అనవాళ్లు సీసీ పుటేజీలో రికార్డు కావడం, గ్రామంలో రెండు రోజు క్రితం పొలం వద్ద వ్యక్తిని చిరుత వెంబడించింది. దీంతో సమాచారం అందుకున్న అటవీ అధికారులు మంగళవారం డీఆర్‌ఓ విజయలక్ష్మి ఎఫ్‌బీఓ అబ్దుల్‌కలాం గ్రామ సమీపంలోని పొలాలు, కాల్వల వెంట పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. ప్రజలు పొలాలకు వెళ్లే సమయంలో ఇద్దరు, ముగ్గురు కలసి వెళ్లాలని సూచించారు.

సంక్షోభంలో ఆప్కో!

- కూటమి ప్రభుత్వంలో మనుగడ కోల్పోతున్న ఆప్కో
- కొత్త చేనేత వస్త్రాలు కొనరు.. షోరూంలకు పంపరు
- పండుగ పూట వెలవెలబోతున్న ఆప్కో షోరూంలు
- ప్రశ్నార్థకంగా మారిన చేనేత వస్త్రాల మార్కెటింగ్
- అమలుకు నోచుకోని ఉచిత విద్యుత్ హామీ

చేనేత వస్త్రాలను మార్కెటింగ్ చేసే ఆప్కో మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గతేడాది అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు ఈ సంస్థపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కళకళలాడిన ఆప్కో దుకాణాలు నేడు మార్కెటింగ్ లేక వెలవెలబోతున్నాయి. కొన్ని మూత పడే పరిస్థితి ఏర్పడింది.



కలెక్టరేట్‌లోని చేనేత భవనం కాంప్లెక్స్‌లో లాక్ చేసిన ఆప్కో షోరూం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేనేత వస్త్రాల మార్కెటింగ్‌కు అనేక చర్యలు చేపట్టింది. కొత్త షోరూములను ఏర్పాటు చేయడంతో పాటు ఆన్‌లైన్ మార్కెటింగ్ సదుపాయం కూడా కల్పించింది. ఆప్కో ద్వారా చేనేత వస్త్రాల వ్యాపారం పెంచేందుకు ప్రత్యేక ఆఫర్లు ఇచ్చింది. ఉద్యోగులు, ఇతర వర్గాల వారికి ప్రత్యేక స్కీమ్‌లు పెట్టి చేనేత వస్త్రాల వైపు మళ్లించే విధంగా చర్యలు తీసుకుంది.అంతే కాకుండా ప్రతి నెల ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని చేనేత సహకార సంఘాలు ఉత్పత్తి చేసిన చేనేత వస్త్రాలను కొని షోరూములకు పంపడం జరిగేది. దీంతో దసరా నెల రోజుల ముందే కొత్తకొత్త డిజైన్‌తో ఆప్కో షోరూములు కళకళలాడేవి. నేడు ఈ పరిస్థితి కనిపించడం లేదు. ఇందుకు కూటమి సర్కారు అలసత్వమే కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చేనేత వస్త్రాలు కొనరు.. పంపరు

చేనేత సహకార సంఘాలు ఉత్పత్తి చేసిన చేనేత వస్త్రాలను ఆప్కో కొనుగోలు చేసి మంగళగిరిలోని ఆప్కో గోదాములో నిల్వ ఉంచుతుంది. అక్కడి నుంచి రాష్ట్రంలోని అన్ని షోరూములకు సరుకు సరఫరా అవుతుంది. ఇది నిరంతర ప్రక్రియ. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేనేత సహకార సంఘాలు ఉత్పత్తి చేసిన వస్త్రాలను ఆప్కో కొనుగోలు చేయడం గణనీయంగా తగ్గిపోయింది. ఉమ్మడి జిల్లాలో కర్నూలు, నంద్యాల, ఎమ్మిగనూరు, ఆదోని, శ్రీశైలంలలో ఆప్కో షోరూములు ఉన్నాయి. కొన్ని నెలలుగా వాటికి కొత్త స్టాక్ రాని పరిస్థితి. 2024 జూన్ నుంచి చేనేత సహకార సంఘాల నుంచి అరకొరగా కొనుగోలు చేసిన సరుకు, బకాయిలు కూడా పేరుకుపోయాయి.

ఆప్కో సిబ్బందికి జీతాలు కూడా లేవు

ఆప్కోలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బందికి వేతనాలు కూడా లేవు. ఈ ఏడాది జూన్ మాసం వరకు మాత్రమే జీతాలు చెల్లించారు. జూలై నుంచి వేతనాలు లేవు. దసరా పర్వదినాన్ని అక్టోబరు 2న నిర్వహించుకోనున్నారు. పండగ నాటికి కూడ వేతనాలు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో సిబ్బంది, ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇప్పుడు జరుగుతుండటంతో ఆప్కో ఏమవుతుందోనన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

చేనేతకు ఉచిత విద్యుత్ ఏదీ?

కూటమి ప్రభుత్వం మాటల్లో చేనేతపై అపారమైన ప్రేమ కనబరుస్తుంది. చేనేతకు 200 యూనిట్లు, పవర్ లూమ్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గత నెలలో జరిగిన చేనేత దినోత్సవంలో ప్రకటించింది. ఇందుకు అనుగుణంగా చేనేత, జౌళిశాఖ అధికారులు కర్నూలు జిల్లాలో 2,457 చేనేత , ఒక పవర్ లూమ్, నంద్యాల జిల్లాలో 385 చేనేత, 73 పవర్ లూమ్స్‌కు ఉచిత విద్యుత్ ఇవ్వడానికి ఏర్పట్లు చేసింది. కాని ఇంతవరకు అది కార్యరూపం దాల్చలేదు. ఆపరేషన్ గైడ్‌లెన్స్ ఇవ్వకపోవడంతో ఉచిత విద్యుత్ గాల్లోనే ఉండిపోయింది.

వ్యాపారం డీలా

ఎప్పటికప్పుడు వ్యాపారం ఎలా పెంచుకోవాలి.. లాభాలను పెంచుకోవడం ఎలా అనే దానిపైనే దృష్టి ఉండాలి. ఏడాదిన్నర కాలం నుంచి ఆప్కోలో నిస్తేజం నెలకొంది. ఇటు చేనేత జౌళిశాఖ మంత్రి కానీ, ఉన్నతాధికారులు కానీ ఆప్కో వ్యాపార అభివృద్ధి గురించి పట్టించుకున్న దాఖలాలే లేవు. దీంతో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1.45 కోట్లకు వ్యాపారం పడిపోగా, ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి ఆరు నెలలు రూ. 1.94 కోట్లు వ్యాపారం చేయాల్సి ఉండగా... ఇప్పటి వరకు రూ. 50 లక్షల కూడా దాటలేదంటే ఆప్కో పరిస్థితి ఎంత దయనీయంగా తయారైందో స్పష్టమవుతోంది.ఇదిలా ఉంటే వివిద ప్రభుత్వ శాఖల్లో కింద స్థాయి ఉద్యోగులు,సెక్యూరిటీ సిబ్బంది తదితరులకు యూనిఫామ్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ ఇస్తుంది. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు ఎలాంటి బడ్జెట్ ఇవ్వలేదు.

ఆశావర్కర్లకు రూ.26 వేల వేతనమివ్వాలి


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి

కర్నూలు(సెంట్రల్) : గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు ఆరోగ్యసేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ఐదో మహాసభలు ఈశ్వరీబాయ్, రవిజాబీ, వెంకటమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఆశావర్కర్లకు చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించడంలో పాలకులు వైఫల్యమయ్యారని విమర్శించారు. నేషనల్ హెల్త్ మిషన్ ఏర్పాటై 20 ఏళ్లు గడిచినా ఆశావర్కర్లను కార్మికులుగా గుర్తించడంలేదని విమర్శించారు. ఆశా వర్కర్లను విచ్చల విడిగా తొలగించడం కూటమి సర్కారు మానుకోవాలని హితవు పలికారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలుగా పి.రమిజాబీ, ప్రధాన కార్యదర్శిగా శివలక్ష్మితోపాటు 33 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

కనెక్షన్ల ఏర్పాటులో నిర్లక్ష్యం!

- బాధిత రైతుల ఫిర్యాదు మేరకు ఇద్దరు ఏఈలపై సస్పెన్షన్ వేటు!

నంద్యాల(అర్బన్): రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోంది. విద్యుత్ మెటీరియల్‌కు అవసరమైన డబ్బు చెల్లించినా అదిగో ఇదిగో అంటూ స్థానిక విద్యుత్ కార్యాలయ అధికారులు కాలయాపన చేస్తున్నారు. దీనిపై విసిగిన బాధిత రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఇద్దరు ఏఈలపై వేటు పడినట్లు తెలిసింది.బనగానపల్లె మండలం డోన్ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోకి వస్తుంది.ఈ మండలానికి సంబంధించిన 200 మంది రైతులు విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటుకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు, కరెంట్ తీగలు తదితర


విద్యుత్ సబ్ స్టేషన్

మెటీరియల్ కోసం రూ.60 లక్షలు చెల్లించారు. అయితే, సామగ్రి అందజేతలో బనగానపల్లె విద్యుత్ కార్యాలయ అధికారులు నిబంధనలు పాటించలేదనే విమర్శలు ఉన్నాయి. మెటీరియల్ కోసం చెల్లించిన సొమ్ముకు సంబంధించిన రికార్డులు సరిగ్గా చూపకపోవడంతో పాటు కొందరికి అరకొరగా మెటీరియల్ పంపిణీ చేయడం, మరికొందరికి మొండిచేయి చూపడం చేశారు. ఈ గోల్‌మాల్‌పై బాధిత రైతులు శాఖ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై నంద్యాల జిల్లా ఎస్ఈ సుధాకర్‌కుమార్, డోన్ సబ్ డివిజన్ ఈఈ కమలాకర్‌రావు వేర్వేరుగా విచారణ జరిపి నివేదికలను విద్యుత్ సీఎండీ, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎండీకి అందజేసినట్లు సమాచారం. దీంతో బనగానపల్లె రూరల్, అర్బన్ ఏఈలు గజ్జప్ప, శ్రీనివాసులును సస్పెండ్ చేస్తూ సోమవారం సీఎండీ కార్యాలయం ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిసింది.అయితే, గుట్టుగా ఈ సస్పెన్షన్ ఎత్తి వేసుకునేందుకు సంబంధిత అధికారులు స్థానిక మంత్రి ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే విద్యుత్ మెటీరియల్ అందించడంలో నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక ఉన్నతాధికారులకు ఇచ్చామని విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్‌కుమార్ తెలిపారు.

గార్గేయపురంలో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గార్గేయపురం బీసీ కాలనీలో ఓ బాలిక, ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. బీసీ కాలనీకి చెందిన బాలిక 10వ తరగతి పూర్తి చేసుకొని ఇంటి వద్దే ఉంటుంది. అయితే, కొంతకాలంగా అదే కాలనీకి చెందిన ఓ యువకుడితో చనువుగా ఉంటుంది. ఈ విషయంలో 15 రోజుల క్రితం రెండు కుటుంబాల మధ్య చిన్నపాటి గొడవ తలెత్తడంతో కర్నూలు తాలూకా అర్బన్ పోలీసులను ఆశ్రయించారు. బాలిక మైనర్ కావడంతో ఇరు కుటుంబాలను సర్ది చెప్పి పంపించారు. సోమవారం అమ్మాయి విషయంలో యువకుడి ఇంట్లో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో మనస్థాపం చెందిన యువకుడు రసాయన ద్రావణం తాగి అపస్మారక స్థితికి చేరుకోగా కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. మీ అమ్మాయి వల్లే ఇదంతా జరిగిందని యువకుడి తల్లిదండ్రులు బాలిక కుటుంబీకులతో వాగ్వాదానికి దిగారు. దీంతో బాలిక తీవ్ర మనస్థాపం చెంది పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ఈ ఆత్మహత్యయత్న సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని కర్నూలు అర్బన్ సీఐ శ్రీధర్ వెల్లడించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సెట్కూరు సీఈఓ వేణుగోపాల్

ఆత్మకూరు: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా యువజన సంక్షేమ శాఖ సెట్కూరు సీఈఓ వేణుగోపాల్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం మత్తు పదార్థాలు, వ్యసనం, పర్యవసనాలు, సైబర్ క్రైమ్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువకులకు సిగరెట్, మద్యం తాగడమేనేది ఫ్యాషన్ అయ్యిందని చెప్పారు. ఈ అలవాటు భవిష్యత్తులో వ్యసనంగా మారి జీవితాన్ని నాశనం చేస్తుందన్నారు. ఈ విషయాన్ని గమనించి మద్యంకు దూరంగా ఉండాలని చెప్పారు. అలాగే ఎవరైనా డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా పది సంవత్సరాలపాటు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారన్నారు. మీ పరిసర ప్రాంతాల్లో మత్తు పదార్థాలు అమ్ముతున్నట్లు తెలిస్తే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫుడ్ కంట్రోల్‌లో అధికారుల కొరత

- కార్యాలయానికంతా ఒకే ఒక్కరు విధులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని సి.క్యాంపులో ఉన్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కార్యాలయంలో అధికారుల కొరత వేధిస్తోంది. మొత్తం కార్యాలయాన్ని ఒకే ఒక్కరు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయంలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనారోగ్యంతో సెలవులో వెళ్లారు. కార్యాలయ సూపరింటెండెంట్ ఇటీవల బదిలీ అయ్యారు. ఈయన బదిలీ అయిన చోట, కర్నూలులో మూడు రోజుల పాటు విధులు నిర్వహించాల్సి వస్తోంది. రెండు అటెండర్ పోస్టులు చాలా కాలంగా ఖాళీగానే ఉన్నాయి. ప్రస్తుతం ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజగోపాల్ ఒక్కరే విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఆయనే కార్యాలయం మొత్తం బాధ్యతను నిర్వహిస్తున్నారు. ముగ్గురు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తీయాల్సిన శాంపిల్స్‌ను ఈయనే తీయడం, వాటిని ల్యాబోరేటరికి పంపించడం, అనంతరం కోర్టు డ్యూటీలకు హాజరు కావడం, వాటిని కంప్యూటర్‌లో నమోదు చేయడం వంటి పనులన్నీ చేస్తున్నారు. కాగా ఎవ్వరైనా ఫుడ్ లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాల్సి వస్తే ఆఫీస్ సూపరింటెండెంట్ ఉండే రోజుల్లో మాత్రమే రావాల్సి ఉంటోంది. ప్రభుత్వం ఇప్పటికైనా అధికారులను నియమించి వ్యాపారుల ఇబ్బందులు తొలగించాల్సిన అవసరం ఉంది.


అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కార్యాలయం

పిల్లల సంరక్షణపై దృష్టి సారించాలి

కర్నూలు(సెంట్రల్) : చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్‌లలో ఉన్న పిల్లల సంరక్షణపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్ జిల్లా స్థాయి కమిటీ చైర్మన్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మిషన్ వాత్సల్యలో భాగంగా మొట్ట మొదటి చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ..జిల్లాలో 11 చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయని, అందులో 4 ప్రభుత్వ ఆధీనంలోవి కాగా, మిగిలిన ఏడు స్వచ్ఛంద సంస్థల ద్వారా నడుస్తున్నట్లు చెప్పారు. ఆయా సంస్థల్లో ఉన్న చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ, చదువు, బట్టలు తదితర సేవలన్నీ పక్కాగా అందేలా చూడాలని కోరారు. ఆయా సంస్థల్లో పనిచేసే సిబ్బంది పిల్లలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. సిబ్బంది పనితీరును గమనించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ విజయ, కమిటీ మెంబర్ సెక్రటరీ టి.శారద, సభ్యులు, మంజుష, ఎస్.మహబూబ్‌బాషా, రాయపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య

పర్యాటక ప్రదేశాల్లో మరిన్ని సౌకర్యాలు

కర్నూలు కల్చరల్ : పర్యాటక ప్రదేశాల్లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. కర్నూలు రూరల్ మండలం పరిధిలోని సుంకేసుల గ్రామ సమీపంలో సుంకేసుల డ్యామ్ వద్ద పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న భవనాన్ని జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుడా ఆధ్వర్యంలో పర్యాటక ప్రదేశాల్లో మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా పర్యాటక, సాంస్కృతిక అధికారి జి.లక్ష్మీనారాయణ, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


సుంకేసులలోని పర్యాటక ప్రదేశాన్ని పరిశీలిస్తున్న జేసీ నవ్య

10 తులాల బంగారం చోరీ

నంద్యాల : ఆర్టీసీ బస్సు ఎక్కిన మహిళ పర్సులో నుంచి పదితులాల బంగారం చోరీ అయ్యింది. మంగళవారం ఈ సంఘటన జరిగింది. నంద్యాల వన్‌టౌన్ సీఐ సుధాకర్ రెడ్డి తెలిపిన మేరకు వివరాలు... నంద్యాల పట్టణానికి చెందిన నాగమణి వెలుగోడు వెళ్లేందుకు పట్టణంలోని సంజీవ నగర్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కింది. ఆ సమయంలో పర్సులో ఉన్న 10 తులాల బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆలస్యంగా చూసుకున్న మహిళ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

సొంతూర్లకు వెళ్లేవారు జాగ్రత్త !

కర్నూలు (టౌన్): దసరా సెలవులకు సొంత ఊర్లకు వెళ్లే కుటుంబాలు తగు జాగ్రత్తలు తీసుకొని చోరీలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. కష్టపడి సంపాదించిన సొమ్ము, విలువైన వస్తువులు దొంగల బారిన పడకుండా బ్యాంకు లాకర్లలో లేదా నమ్మకం ఉన్న వారి ఇళ్లలో భద్రపరచుకోవాలన్నారు. విలువైన ఆభరణాలు, డబ్బు వెంట తీసుకెళ్లేవారు ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, కార్పెంటర్లు, గ్యాస్ రిపేర్ పేరిట వచ్చే అనుమానిత వ్యక్తులను నమ్మవద్దని, కాలనీలలో అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతుంటే సమీప పోలీసు స్టేషన్‌కు లేదా 100, 112 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

కుక్కలదాడిలో జింక మృతి



ఉయ్యాలవాడ: మండలంలోని హరివరం గ్రామంలో కుక్కల దాడిలో జింక మృతి చెందింది. తహసీల్దార్ ప్రసాద్ బాబు తెలిపిన వివరాల మేరకు.. పొలాల్లో సంచరిస్తున్న జింకలు సోమవారం రాత్రి గ్రామంలోకి వచ్చాయి. గమనించిన కుక్కలు వాటి వెంటపడి దాడి చేయగా ఓ జింక మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు బనగానపల్లె అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. వారు గ్రామానికి చేరుకుని పోస్టుమార్టం నిర్వహించి, అక్కడే జింకకు దహన సంస్కారాలు చేశారు.

అట్టహాసంగా ఫుట్‌బాల్ పోటీలు షురూ


మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్న దృశ్యం


ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

- 13 జిల్లాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు

ఎమ్మిగనూరు టౌన్: రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైయ్యాయి. కర్నూలు జిల్లా అండర్ -19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఈపోటీలో పాల్గొనేందుకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి బాలబాలికలు హాజరయ్యారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లయ్య, ఫుట్‌బాల్ అసోసియేన్ నాయకులు రామకృష్ణ నాయుడు,స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి రాఘవేంద్రఆచారి పోటీలను ప్రారంభించారు. మూడురోజుల పాటు జరిగే ఈ పోటీల్లో తొలి రోజు కృష్ణా-తూర్పుగోదావరి, విజయనగరం-అనంతపురం, పశ్చిమగోదావరి- నెల్లూరు, చిత్తూరు- ప్రకాశం జిల్లాల బాలుర జట్టు తలపడ్డాయి. కాగా పోటీల సమయంలో వర్షం పడటంతో క్రీడాకారులు కొంత ఇబ్బంది పడ్డారు. వర్షపు నీరు నిలవడంతో మైదానం బురదమయంగా మారింది.అయినా, ఆయా జట్ల క్రీడాకారులు ఆటను కొనసాగించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు అక్టోబర్ 5వ తేదీన జమ్ముకాశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పోటీల రాష్ట్ర పరిశీలకులు ప్రభాకర్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి రామాంజినేయులు,ప్రైవేట్ స్కూళ్ల వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు సుంకన్న, పోటీల నిర్వాహకులు వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహరాజు, శ్రీనివాసులు, హనీఫ్, సీజీ ఈరన్న, శ్రీరాములు,లతీఫ్, వెంకటేష్, బసవరాజు, సురజ్, గంగాధర్, శేషు, మనోహర్, వీరేష్ పలువురు పీఈటీలు పాల్గొన్నారు.

ఆశలు వర్షార్పణం


హొళగుంద సమీపంలో పత్తి పొలంలో నిలిచిన వర్షపు నీరు


హొళగుంద-ధణాపురం రోడ్డులో పొంగి ప్రవహిస్తున్న గల్లివంక

హొళగుంద: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు పంటలు దెబ్బతింటున్నాయి. దీంతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. హొళగుంద మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తి, వేరుశనగ, మిరప తదితర పంటలు చేతికి వచ్చాయి. అయితే, సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. హొళగుంద, గజ్జహళ్లి, ఇంగళదహాల్, పెద్దగోనెహాళ్, పెద్దహ్యాట, వందవాగిలి, హెబ్బటం, చిన్నహ్యాట తదితర గ్రామాల పరిధిలో దాదాపు 6 వేల ఎకరాల పత్తి పంట నీటిపాలైంది. పొలాల్లో తేమశాతం పెరగడంతో మిరప, వేరుశనగ పైర్లు కుళ్లిపోయాయి. జరిగిన నష్టంపై ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరతున్నారు.